కుప్పలుగా పేరుకుపోతున్నా పట్టదా..?

- కొన్నిచోట్ల వారం రోజులుగా పేరుకుపోయిన చెత్త
- ఎప్పటికప్పుడు తరలించడంలో నిర్లక్ష్యం


జీడిమెట్ల పారిశ్రామికవాడలో పేరుకుపోయిన చెత్తా చెదారం

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల పారిశ్రామికవాడలోని పలు ప్రాంతాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం పేరుకుపోతోంది. మున్సిపల్, ఇండస్ట్రియల్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రతిరోజూ తరలించాల్సిన చెత్త వారం రోజులైనా తొలగించకపోవడంతో ఆ ప్రాంతం అస్తవ్యస్తంగా మారుతోంది. అయోధ్య నగర్ శ్మశానవాటిక నుంచి జీడిమెట్ల పారిశ్రామిక వాడకు వెళ్లే ప్రధాన దారిలో ఇరువైపుల చెత్తా చెదారం పేరుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశ్రామికవాడలో ప్రధాన చౌరస్తాల వద్ద ఉన్న చెత్తాచెదారాలను త్వరితగతిన తొలగించే ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సర్వీస్ రోడ్డు.. పార్కింగ్‌కు అడ్డా..


గంగా ఎన్‌క్లేవ్ నుంచి అంగడిపేట్‌కు వెళ్లే సర్వీసు రోడ్డు పరిస్థితి

కుత్బుల్లాపూర్: కొంపల్లి నుంచి సుచిత్ర వైపు రెండు ప్రాంతాల్లో ఫ్లైఓవర్ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. ఈ నేపథ్యంలో సర్వీస్ రోడ్ల మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించి రాకపోకలు సాగిస్తున్నారు. అయితే సర్వీస్ రోడ్డు పక్కనే నో పార్కింగ్ బోర్డు ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్లియర్ చేయాలని ఒకవైపు ప్రయత్నిస్తుండగా మరోవైపు ఎక్కడపడితే అక్కడ వాహనాలు పార్కింగ్ చేసి వెళ్తుండటంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు ముందుకు వెళ్లలేకపోతున్నాయి. ముఖ్యంగా గంగా ఎన్‌క్లేవ్ నుంచి డీమార్ట్ మీదుగా అంగడిపేటకు వెళ్లే సర్వీస్ రోడ్డు మొత్తం ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇక్కడ విధుల్లో ఉండే ట్రాఫిక్ పోలీసులు కేవలం పార్కింగ్ చేసి వెళ్లే వాహనాల ఫొటోలు దించి చలాన్ పంపే ఏర్పాటు చేస్తున్నారే తప్ప అక్కడ వాహనాలు నిలపకుండా కట్టడి చేయలేకపోతున్నారు. దీంతో ఈ సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్‌తో నరకయాతన తలపిస్తుంది.

దివ్యాంగులకు క్రికెట్ పోటీలు

దుండిగల్: దుండిగల్‌లోని ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో శుక్రవారం దివ్యాంగులకు ఐసీసీఎల్ ఐఎఫ్ ఎంఎల్ఆర్ఐటీ హెచ్ఏపీ క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేత, రన్నరప్‌గా నిలిచిన జట్ల సభ్యులకు కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి ట్రోఫీ, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ వైకల్యం దేనికీ అడ్డుకాదని, పట్టుదల, కృషి ఉంటే ఏదైనా సాధించవచ్చన్నారు. సెయింట్ మార్టిన్స్ కళాశాల డైరెక్టర్లు చంద్రశేఖర్, సంతోష్, ఎంఎల్ఆర్ఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, రామ్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ కప్‌లో విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి

టెండర్ల పేరుతో కాలయాపన

- నెల రోజులుగా తాగునీటి వృథా
- స్థానిక నాలాలో కలుస్తున్న తాగునీరు
- స్పందించని జలమండలి అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు


బాలానగర్- నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో డీమార్ట్ వద్ద లీకవుతున్న గోదావరి జలాలు

చింతల్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా వందలాది కిలో మీటర్ల నుంచి తీసుకువచ్చిన గోదావరి జలాలు రోడ్డు పాలవుతున్నాయి. నెల రోజులుగా ప్రధాన రోడ్డుపై పారుతున్న నీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సకాలంలో మరమ్మతులు చేపట్టి నీటి వృథా అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ పరిధిలోని షాపూర్‌నగర్, జగద్గిరిగుట్ట రిజర్వాయర్ల నుంచి బాలానగర్ వెళ్లే 800 పైప్‌లైన్‌కు డీమార్ట్ సమీపంలోని చాంబర్ వద్ద ఉన్న రెండు మ్యాన్‌వాల్వ్‌లకు లీకేజీ ఏర్పడింది. దీంతో నెల రోజులుగా బాలానగర్-నర్సాపూర్ రాష్ట్ర రహదారి వెంబడి డీమార్ట్, ఇందిరాగాంధీనగర్, సౌభాగ్యనగర్, ఆదర్శనగర్ మీదుగా వృథా అయిన నీరు స్థానికంగా ఉన్న నాలాలో కలుస్తోంది. దీంతో రోడ్డుపై నీటి ప్రవాహంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో మరమ్మతులు చేపట్టి నీటి లీకేజీని అరికట్టాల్సిన అధికారులు టెండర్ల పేరుతో కాలయాపన చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

సాక్షి, సిటీబ్యూరో: ఆకర్షణీయమైన ప్యాకింగ్, ఘుమఘుమలాడే వంటకాల వాసనలు, నోరూరించే ఆహార పదార్థాలు. బయట హోటళ్లు, తోపుడు బండ్లలో కనిపిస్తుంటాయి. భోజన ప్రియులను ఆకట్టుకునే ప్రయత్నం బాగున్నా.. అందులో వినియోగించే నాసిరకం సరుకులు, హానికరమైన రంగులతో ముప్పు పొంచి ఉంది. నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 29 పురపాలక సంఘాలు, పలు పంచాయతీల్లోని చాలా హోటళ్లు, తినుబండారాల తయారీదారులు నిబంధనలు పాటించకుండా ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. ఆహార భద్రత టాస్క్ ఫోర్స్ బృందం ఇటీవల నగరంలో పలు హోటళ్లు, ఆహార పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలించగా.. ఇవన్నీ తేటతెల్లం అయ్యాయి.

నిబంధనలు గాలికి

ఆహార వ్యాపారాలు ఊపందుకున్నాయి. హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, తినుబండారాల తయారీ కేంద్రాలు వెలిశాయి. ఆహార పదార్థాల తయారీదారులు, విక్రేతలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రమాణాలను పాటిస్తూ, శుభ్రతతోపాటు తాజా సరుకులతో పదార్థాలను తయారు చేయాలి. చాలా కేంద్రాలు ఈ నిబంధనలకు గాలికి వదిలేస్తున్నారు. చెడిపోయిన, కుళ్లిపోయిన పదార్థాలు, బూజు పట్టిన కూరగాయలు, రోజులకొద్దీ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన పదార్థాలు, కాలం చెల్లిన మసాలాలు, నిత్యావసరాలు, నాసిరకం పిండి, వాడిన నూనెలు మళ్లీ వాడటం, కృత్రిమ రంగులు వినియోగించడం వంటివి చేస్తున్నారు. హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితోపాటు హైదరాబాద్-నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ కొట్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఆహార పదార్థాలపై పడుతోంది. అయినప్పటికీ నిర్వాహకులు వాటిని విక్రయిస్తున్నారు.

ఆకట్టుకునేందుకు రంగులు

వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆహార పదార్థాల్లో ప్రమాదకరమైన రంగులను కూడా వాడుతున్నారు. హోటళ్లలో సమోసాలు, బజ్జీలు, గారెలకు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో చికెన్ మంచూరియా, వెజ్ మంచూరియాల తయారీలో ఎరుపు రంగు వాడుతున్నారు. మిగిలిన వాటిని ఫ్రిజ్‌లో ఉంచి మరుసటి రోజు విక్రయిస్తూ.. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుకుంటున్నారు. మాంసం క్రయవిక్రయ కేంద్రాల్లో కూడా పరిశుభ్రత పాటించటం లేదు.

పర్యవేక్షణ లోపం

ఆహార భద్రతాధికారి పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు పురపాలక సంఘాల్లో కూడా హెల్త్ ఆఫీసర్లు లేకపోవటంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలలోని పదార్థాలపై పర్యవేక్షణ కరువవుతోంది. దీంతో తినుబండారాల తయారీతోపాటు హోటళ్లు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలను నడిపే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.


పట్టుబడిన వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ (ఫైల్)

మార్గం.. సుగమం

- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా..
- వాహనదారులకు అవగాహన కల్పిస్తూ..
- అన్ని శాఖల సమన్వయంతో ముందుకు..
- మెరుగైన ఫలితాలు సాధిస్తున్న జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు

సుభాష్‌నగర్: వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ నిర్ణీత సమయంలో వారి గమ్యస్థానాలకు చేరే విధంగా జీడిమెట్ల ట్రాఫిక్ పోలీసులు నడుం బిగించారు. కొన్ని నెలలుగా కష్టపడి అనుకున్న లక్ష్యం సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు. జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ నేతృత్వంలో ఎప్పటికప్పుడు వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి వాహనదారుడు కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించేలా జాగ్రత్త పడుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. దాంతో పాటు జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి నగర శివారు ప్రాంతం కావడంతో స్థానికంగా పారిశ్రామికవాడ, ఇంటర్నేషనల్ విద్యాసంస్థలు, బహుళ కంపెనీలు, దీనికి తోడుగా వేగంగా సాగుతున్న నిర్మాణ రంగంతో ఈ ప్రాంతంలోని రోడ్లు నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటున్నాయి. దీంతో ఆ రోడ్డుపై చిన్నపాటి అంతరాయం కలిగితే గంటల తరబడి వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కోవాల్సిందే.. ప్రస్తుతం ఆ సమస్యకు చాలా వరకు పరిష్కారం లభించింది.

వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేస్తూ..

ఆర్అండ్‌బీ, జీహెచ్ఎంసీ, విద్యుత్, వాటర్, డ్రైనేజీ, టెలిఫోన్, గ్యాస్ పైప్‌లైన్, ఫారెస్ట్ ఇతర శాఖలకు సంబంధించిన శాఖల వారు ఏ మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఈ రోడ్డుపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో ట్రాఫిక్ పోలీసులు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. సమస్య వచ్చిన వెంటనే ఆ శాఖ అధికారులకు సమస్యను తెలియజేసి, వారు త్వరగా పరిష్కరించేలా కృషి చేస్తున్నారు.

కేసులు, చలాన్లు..

2024 జనవరి 1 నుంచి ఈ నెల 25 వరకు జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని 3,83,578 కేసులు రాయగా, రూ.17,75,23,060 చలాన్ల రూపంలో విధించారు. గత సంవత్సరం డ్రంక్ అండ్ డ్రైవ్ 3,482 కేసులు రాగా, కౌన్సెలింగ్ ద్వారా చాలామంది మందుబాబులు వెనక్కి తగ్గడంతో ఈ సంవత్సరం కేవలం 1,473 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు వచ్చాయి. గత సంవత్సరంతో పోలిస్తే 65% తగ్గాయి.

చౌరస్తాల విస్తరణ..

జీడిమెట్ల ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో 6 జంక్షన్ లైన్ ఐడీపీఎల్, జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్ వైజంక్షన్, షాపూర్‌నగర్, గాజులరామారం, బౌరంపేట్ చౌరస్తాల్లో ఉన్న వివిధ రాజకీయ పార్టీల ప్రముఖుల విగ్రహాలను ఆయా పార్టీల నాయకులతో మాట్లాడి రోడ్డు పక్కన ఓవైపు ఏర్పాటు చేసి చౌరస్తాలను వెడల్పు చేశారు. దీంతో పాటు బహదూర్‌పల్లి, సూరారం, ఇతర జంక్షన్ల విస్తరణకు ఆయా శాఖ అధికారులతో సంప్రదింపులు జరిపి విస్తరణ చేపట్టేందుకు సన్నాహాలు ప్రారంభించారు. అదేవిధంగా ప్రధాన రోడ్లపై వెలిసిన వందల సంఖ్యలో డబ్బాలను జీహెచ్ఎంసీ అధికారులతో తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేశారు.

భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య రాకుండా..



రోడ్డుపై వాహనాలు నిర్ణీత సమయంలో వెళ్లేందుకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తూ ముందుకు వెళ్తున్నాం. రోడ్డు నిబంధనలు అతిక్రమించిన వారికి కాసేపు సమయం కేటాయించి కౌన్సెలింగ్ ఇస్తున్నాం. దీని ద్వారా చాలా మంచి ఫలితాలు వస్తున్నాయి. పోలీస్ స్టేషన్ పరిధిలో పండగలు, ఇతర సమయాల్లో డ్రోన్ ద్వారా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకున్నాం. వచ్చే సంవత్సరం నుంచి ట్రాఫిక్‌కు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా కసరత్తు ప్రారంభించాం. అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టొచ్చు.

– బి.శ్రీనివాస్, జీడిమెట్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్.


గణేశ్ నిమజ్జనంలో డ్రోన్‌తో ట్రాఫిక్ సమస్య తెలుసుకుంటూ..


సైబరాబాద్ కమిషనర్ అందించిన కిట్లను సిబ్బందికి పంపిణీ చేస్తూ..


రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిని తొలగించే పనిలో..

పెండింగ్ పనులను త్వరలో పూర్తి చేస్తాం


ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యలు వివరిస్తున్న ప్రజలు

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో ఇప్పటికే అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశామని, మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన వివిధ ప్రాంతాల ప్రజలు ఆయనను కలిసి వినతి పత్రాలు అందజేశారు. స్పందించిన ఆయన ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు పాత్ర కీలకం

బాలానగర్ సీఐ నరసింహరాజు


సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న బాలానగర్ సీఐ నరసింహరాజు

రంగారెడ్డినగర్: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర ఎంతో కీలకమని బాలానగర్ సీఐ నరసింహరాజు అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి గిరినగర్‌లో పోచమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కేంద్రాన్ని మాజీ కౌన్సిలర్లు వంగాల చంద్రమ్మ, నరసయ్యతో కలిసి సీఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణకు అందరూ సహకరించాలని, ఒక్క సీసీ కెమెరా వేయి కళ్లతో సమానమని పేర్కొన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, కొత్త వారు మీ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థను అందించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సరిత, పోచమ్మ గుడి కమిటీ అధ్యక్షుడు యాదగిరి, ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు వంగాల శ్రీనివాస్, సలహాదారులు మల్లేష్ ముదిరాజ్, అంజయ్య, విజయప్రకాష్, భరత్, స్థానిక నాయకులు పోచయ్య, రమ్మీగౌడ్ తదితరులు ఉన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి


షాపూర్‌నగర్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్


బాచుపల్లిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి

ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్ది దేశాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు దివంగత ప్రధాని మన్మోహన్‌సింగ్ అని వక్తలు కొనియాడారు. ఆయన గురువారం రాత్రి మృతి చెందగా శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా మన్మోహన్‌సింగ్ సేవలను దేశ ప్రజలు ఎన్నటికీ మరిచిపోరని, ఉపాధి హామీ, ఆహార భద్రత పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు విదేశీ పెట్టుబడులు, వ్యాపారాన్ని ఆయన పెంపొందించారని వక్తలు పేర్కొన్నారు.

– కుత్బుల్లాపూర్


మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ నాయకుడు పున్నారెడ్డి


కాంగ్రెస్ కొంపల్లి మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో..


చింతల్‌లో నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ నేత చింతల నాగరాజు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని పేట్‌బషీరాబాద్ సెక్షన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ మీనాక్షి ఎస్టేట్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 11.30 గంటల వరకు మీనాక్షి కాలనీ, స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, అంగడిపేట్, 11కేవీ జయరామ్ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 12.30 గంటల వరకు జయరామ్‌నగర్, శ్రీకృష్ణనగర్, రుక్మిణి ఎస్టేట్స్, జేకే నగర్, చర్మాస్ జీన్స్ ఫ్యాక్టరీ, 11కేవీ రామరాజునగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రామరాజునగర్, రష్ ఆస్పత్రి ఏరియా, మైఫ్రెండ్స్ సర్కిల్, గ్రీన్ పార్కు ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేడు తిరుప్పావై సదస్సు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ గోదావరి హోమ్స్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తిరుప్పావై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు తిరుప్పావై సదస్సు ఉంటుందని, ఇందులో భాగంగా వేద పండితులతో గోదాదేవి విరచిత తిరుప్పావై ప్రవచనాలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ పేర్కొంది.

నేడు రవీంద్రభారతి స్కూల్ వార్షికోత్సవం

దుండిగల్: దుండిగల్ మున్సిపల్ గండిమైసమ్మలోని రవీంద్రభారతి స్కూల్‌లో శనివారం వార్షిక వేడుకలను నిర్వహిస్తున్నారు. సాయంత్రం 5.30 గంటలకు పాఠశాల ఆవరణలో జరిగే కార్యక్రమానికి న్యూరాన్స్ గ్రూప్ ఫౌండర్ జాన్ హేమంత్‌కుమార్, రవీంద్రభారతి గ్రూప్ ఆఫ్ స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రేవంత్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.

వడ్డెర సంఘం నూతన కార్యవర్గం నియామకం

సుభాష్‌నగర్: వడ్డెర కులస్తులు అన్నిరంగాల్లో రాణించాలని అఖిల భారత వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. రాష్ట్ర మహిళా కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శిగా ఈడగోటి పార్వతి, రాష్ట్ర కార్మిక విభాగం కార్యదర్శిగా నాగేష్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా విశ్వసుందర్, హైదరాబాద్ యూత్ అధ్యక్షుడిగా నాగరాజును నియమిస్తూ జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్, జాతీయ మహిళా అధ్యక్షురాలు తిరుమల దేవితో కలిసి శుక్రవారం కార్యాలయంలో నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రమ, సాతాల గోపాల్, గిరిబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


సునీతదేవి(ఫైల్)

కుత్బుల్లాపూర్: ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దూలపల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన సునీతదేవి(23) ఈ నెల 21న రాత్రి 7 గంటల ప్రాంతంలో ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకుండా పోయింది. దీంతో శుక్రవారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి


సమావేశంలో పాల్గొన్న మల్లారెడ్డి, కాంతారావు, నాయకులు

కూకట్‌పల్లి: బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేపీ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కమిటీల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇప్పటి వరకు పూర్తి చేసిన సభ్యత్వ నమోదు, పోలింగ్ బూత్ కేంద్రాలకు సంబంధించిన బూత్ అధ్యక్షులు, వారి పూర్తి కమిటీల నియామక వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీజేపీ పార్టీ పట్ల సానుకూలత ఉందన్నారు. ప్రజల్లో ఉంటూ పని చేయాలన్నారు. అనంతరం బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు మాట్లాడుతూ.. సామాన్యులు సైతం పార్టీ సభ్యత్వాలు తీసుకోవటం పార్టీ శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహాన్ని నింపుతోందన్నారు. ఇప్పటి వరకు 50 వేల పైచిలుకు సభ్యత్వాలను పూర్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సూర్యారావు, సీనియర్ నాయకులు శ్రీధర్‌రావు, భగవంత్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, రాము, గోపి, అనిల్, సంతోష్, శేఖర్, సూరిబాబు, ప్రేమ్ కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.